
HAPPY
Women's Day
- 2025 -
“యత్ర నార్యంతు
పూజ్యంతే రమంతే
తత్ర దేవతా”
స్త్రీ ఎక్కడ
గౌరవించబడుతుందో
అక్కడ దేవతలు ఉంటారు..
మహిళా దినోత్సవ
శుభాకాంక్షలు
శ్రీ వారాహి సిల్క్స్
కృష్ణాపార్క్ దగ్గర, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శుక్రవారం 7-3-2025
సంపుటి: 20 సంచిక: 292
పేజీలు: 8 వెల: రూ.1



## చెరువుగట్టుపై మొక్కలు తొలగిస్తే చర్యలు

**- 'సత్యం' కథనంపై స్పందించిన అధికారులు -**

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎచ్చెర్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఏడు చెరువులను గ్రామ పెద్దలంతా కలిసి రూ.10లక్షలకు ఐదేళ్లకు లీజుకు ఇచ్చేసిన ఘటనపై 'చెరువులు రాసిచ్చేశారోచ్' కథనంపై గ్రామ పంచాయతీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి మొక్కలు వేయడం చట్టరీత్యా నేరమని, ఈ నెల 4న గ్రామపంచాయతీలో తీర్మానం నెంబర్ 6 ప్రాప్తికి ఆమోదించినట్టు పంచాయతీ కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడు చెరువుల గట్లపై అక్రమంగా పెంచిన నీలగిరి మొక్కలపై - మిగతా చివరి పేజీలో


- ఎమ్మెల్యేకే దమ్కీ ఇచ్చిన డ్వామా పీడీ
- హెలికాప్టర్ టూరిజం తెచ్చిన ముప్పు
- ఉపాధి గ్రామసభల్లో నాయకుల భజన వద్దన్న అధికారి
- సిబ్బందితో పాటు కూటమి నాయకులూ బాధితులే

"ఎక్కడా ఎవరి దగ్గరా కనీసం టీ, కాఫీ కూడా ఆశించకండి.. వీలైతే మీ నీరు మీరే పట్టుకెళ్లండి. నేను కూడా అదే పని చేస్తాను. మీరూ అలా ఉంటేనే సక్రమంగా పని చేయగలం. ప్రతీదానికి డబ్బులు ఆశించడం, కాదంటే కొర్రీలు పెట్టడం వంటి పనులు ఇకనైనా మానుకోండి."

ఈ స్టేట్‌మెంట్ ఇవ్వడంతో పాటు ఎక్కడా ఎవర్నుంచీ టీ, కాఫీ కూడా ఆశించకుండా తన వాటర్ తానే తెచ్చుకొని పని చేస్తున్న అధికారి ఆయన. ఇది నాణేనికి ఒక కోణం.

"మీరు నా మీద సభాహక్కుల నోటీసులు ఇచ్చి అసెంబ్లీకి పిలిపిస్తే నేను మీ మీద అట్రాసిటీ కేసు పెట్టగలను. మీరు ఎమ్మెల్యే అయినంత మాత్రాన మీరేం చేసినా చూస్తూ కూర్చోలేను. నేనూ ఎదురుదాడి చేయగలను."

ఇది అదే అధికారిలో కనిపిస్తున్న నాణేనికి రెండోకోణం. ఒకే వ్యక్తిలో ఈ స్ప్లిట్ పర్సనాలిటీ ఉండటం అపరిచితుడు సినిమాలో చూశాం. ఇప్పుడు డుమా పీడీ సుధాకర్‌నే చూస్తున్నాం.





జిల్లా నీటి యాజమాన్య సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, అయినదానికీ, కానిదానికీ షోకాజ్ నోటీసులు ఇస్తున్నారని, మహిళా ఉద్యోగులని కూడా చూడకుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని, రాత్రి 11 దాటాక కూడా పని చేయిస్తున్నారని ఇటీవల జిల్లా వ్యాప్తంగా డుమా ఉద్యోగులు నిరసన తెలిపింది, డీఆర్వోకు వినతిపత్రం సమర్పించింది ఈ పీడీ సుధాకర్‌పైనే. ఇప్పుడు ఇదే పీడీ స్వయంగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌పైన ఎస్సీ అట్రాసిటీ కేసు పెడతానని పేర్కొన్నట్టు పార్టీలో పెద్ద చర్చ నడుస్తుంది. ఈ కథాకమామీషులోకి వెళ్లాలంటే ముందుగా రాష్ట్ర పండుగగా ఇటీవల జరుపుకొన్న రథసప్తమి వేడుకల ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లాలి.

# మీరు సభాహక్కులకెళితే.. నేను అట్రాసిటీ పెడతా!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రథసప్తమి సందర్భంగా హెలీకాప్టర్ టూరిజం అంటూ నాలుగు రోజులు ఇక్కడ హెలికాప్టర్ గాలిలో ఎగిరింది. దీనికి విపరీతమైన డిమాండ్ వచ్చింది. హెలికాప్టర్ నడిపేవాడికి ఎక్కడా విశ్రాంతి లేకుండా గాలిలో చక్కర్లు కొడుతునే ఉంది. దీనిని డుమా పీడీ నేరుగా పర్యవేక్షించారు. టిక్కెట్ల అమ్మకం, పైలెట్ వసతి వంటివి ఆయనే చూశారు. ఈ హెలికాప్టర్ ఎక్కడానికి డుమా టిక్కెట్ కౌంటర్ తెరిచింది. దీనికి జనాలు పోటెత్తడంతో పీడీ సిఫార్సు ఉన్న లేఖ ఉంటేనే టిక్కెట్లు ఇచ్చే విధానాన్ని రెండోరోజు ప్రవేశపెట్టారు. ఈ సమయంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు హెలికాప్టర్ టిక్కెట్ కోసం ప్రయత్నించినా దొరకలేదు. దీంతో ఎమ్మెల్యే గొండు శంకరే పీడీకి పలుమార్లు ఫోన్ చేసినా ఆయన లిఫ్ట్ చేయలేదట. చివరకు గత్యంతరం లేక జిల్లా కలెక్టర్‌కు శంకర్ ఫోన్ చేయడం, కలెక్టర్ దినకర్ పుండ్కర్ పీడీకి ఫోన్ చేయడం, అయినా ఆయన స్పందించకపోవడంతో జిల్లా అధికారుల గ్రూపులో టిక్కెట్లు కావాలంటూ కలెక్టర్ మెసేజ్ పెట్టడంతో 12 టిక్కెట్లు ఇచ్చినట్లు భోగట్టా. అయితే ఎమ్మెల్యేగా రాష్ట్ర పండగగా రథసప్తమి జరపడంలో ముఖ్యమంత్రిని ఒప్పించిన తనకే హెలికాప్టర్ ఎక్కడానికి టిక్కెట్ ఇవ్వకపోవడం, ఫోన్ చేస్తే పీడీ స్పందించకపోవడంపై అసెంబ్లీ సమావేశాల్లో పీడీపై సభాహక్కుల నోటీసు ఇస్తానంటూ ఎమ్మెల్యే పేర్కొనడంతో, అదే జరిగితే తాను అట్రాసిటీ కేసు పెడతానని పీడీ సమాధానమిచ్చినట్టు చర్చ నడుస్తుంది. ఎమ్మెల్యే వెనక్కు తగ్గారో, లేదూ అంటే జిల్లాలో వేరేవారి అండదండలున్నాయని భావించారో తెలీదు గానీ ప్రస్తుతానికి ఇరువురూ అంతవరకు వెళ్లలేదు. స్వయంగా హెడ్‌క్వార్టర్ ఎమ్మెల్యే మీదే పీడీ స్థాయి అధికారి ఈ విధంగా కేసు పెడతాననడం ఇప్పుడు సంచలనమై కూర్చుంది. పీడీగా సుధాకర్ వచ్చిన తొలిరోజుల్లోనే గార మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల కోసం ఓచోట గ్రామసభ నిర్వహిస్తే, అందులో పాల్గొన్న టీడీపీ నాయకులు ఎమ్మెల్యే, ఎంపీలు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని వివరిస్తుంటే, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ఏ పనులు - మిగతా చివరి పేజీలో







# చిలకపాలెం.. ఆ దారిలో పోలేం

- రద్దీకి అనుగుణంగా డిజైన్ కాని ఫ్లైఓవర్
- టిప్పర్లు, క్వారీలు, కాలేజీలు అన్నింటికీ అదే కేరాఫ్
- అక్కడికక్కడే మూడుచోట్ల ఆటోస్టాండ్లు
- ప్రమాదాలపాలవుతున్న పాదచారులు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తక్కువ సమయంలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో చిలకపాలెం ఒకటి. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ ప్రాంతం వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా మారిపోయింది. జాతీయ రహదారి విస్తరణ తర్వాత మరింత రద్దీగా తయారైంది. చిలకపాలెం పరిధిలో విద్యాసంస్థలు, మధ్యతరహా పరిశ్రమలు, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు, రియల్ వ్యాపార కేంద్రం కావడంతో రోజు రోజుకు జంక్షన్లో ట్రాఫిక్ పెరగడంతో స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, సుదూర ప్రాంతాలకు వెళ్లే ట్రావెల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, ఇంజనీరింగ్ కళాశాలలు, విద్యాసంస్థలకు చెందిన వాహనాలు, బస్సులు, గ్రావెల్, చిప్స్ క్వారీల నుంచి టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు, ట్రాన్స్‌పోర్టు వెహికల్స్ రాకపోకలతో నిత్యం రద్దీ కొనసాగుతుంది. ఈ వాహనాలన్నీ ఈ కూడలి నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. విశాఖపట్నం, ఒడిశా వైపు వెళ్లే ప్రయాణీకులు ఈ కూడలిని ఆశ్రయించి ప్రయాణాలు సాగిస్తుంటారు. ఒడిశాలోని జైపూర్, కొరాపూట్ తదితర ప్రాంతాలకు ఒడిశా నుంచి పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, అధికారిక వాహనాల రాకపోకలకు ప్రధానమైన మార్గంగా ఉంది. ఇండస్ట్రీయల్ హబ్‌గా తయారైన రాజాంకు భారీ వాహనాలు, సాలూరు, బొబ్బిలికి వాహనాలు రాకపోకలు ఈ మార్గం నుంచే సాగుతుంటాయి. కూడలి కావడం స్థానిక గ్రామాలు ప్రజలంతా నిత్యావసరాల కోసం చిలకపాలెంను ఆశ్రయించడంతో నిత్యం జనసంచారంతో రద్దీని తలపిస్తాయి. కూడలి నుంచి నడుచుకొని రోడ్డు దాటడానికి పాదచారులు భయపడుతున్న పరిస్థితికి చేరింది. వాహనాల రద్దీ కారణంగా తరచూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు కారణమవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తమవుతుంది. జంక్షన్‌లో రోడ్లు దాటుతున్న పాదచారులు వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా జీఎస్టీ అమల్లోకి వచ్చినంత వరకు వాణిజ్యపన్నుల శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టును దశాబ్దాల పాటు నిర్వహించడంతో చిలకపాలెం జంక్షన్ ల్యాండ్ మార్క్‌గా గుర్తింపు పొందింది. ఈ కూడలి నుంచే మిర్చి, వేరుశనగ, జూట్, పత్తి, జొన్న తదితర ఉత్పత్తులు ఎగుమతి అవుతుండేవి. కాలక్రమేణా మిర్చి మినహా మిగతా ఎగుమతులు అంతంత మాత్రంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం వీటి స్థానంలో ఉల్లి, వెల్లుల్లి, ఎండుచేపలు, బ్రాయిలర్ కోళ్లు, గుడ్లు హోల్‌సేల్ వ్యాపారం, ఎగుమతులు ప్రారంభమయ్యాయి. దీంతో నిరంతరం వాహనాల రాకపోకలతో కూడా జంక్షన్‌లో ట్రాఫిక్ పెరిగింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఇంజనీరింగ్ అధికారులు డిజైన్ చేయలేకపోయారన్న విమర్శలున్నాయి. ఈ కారణంగానే తరచూ చిలకపాలెం జంక్షన్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయని విమర్శలు ఉన్నాయి.

సర్వీస్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై చిరువ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులు చేరడంతో జనం మధ్యలోంచే భారీ వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో భారీ వాహనాలను సర్వీసు రోడ్డులోకి మళ్లించాలంటే ఇబ్బందకర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో కొన్నిసార్లు ట్రాఫిక్ నిలిచి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పొందూరు-రాజాం రోడ్డుకు ఇరువైపులా పండ్ల దుకాణాలు, కూరగాయల వ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనికితోడు మూడుచోట్ల ఆటోస్టాండ్లు ఉన్నాయి. రణస్థలం, పొందూరు, శ్రీకాకుళం రూట్లలో ప్రయాణీకులు వెళ్లేందుకు వీలుగా ఆటోస్టాండ్లను ఏర్పాటుచేశారు. సర్వీసు రోడ్డులోనే ఆటోలు నిలిపి రోడ్లపైనే టిక్కెట్ సర్వీసు చేస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వాహనాల క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చొరవ చూపించకపోవడం వల్ల సమస్య మరింత జఠిలమవుతుందని చెబుతున్నారు. ఈ సమస్యకు పోలీసు ఉన్నతాధికారులు, జాతీయ రహదారి అధికారులు చొరవ చూపించి పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.



• ఎడిటోరియల్

# ఎమ్మెల్సీ ఫలితాలు కూటమికి హెచ్చరిక

ఏపీలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చాయి. అయినా ఫలితాలు చూశాక అలర్ట్ కావాల్సిన పరిస్థితి మాత్రం ఎదురైంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ స్థానం ఫలితంలో చోటుచేసుకున్న ట్విస్ట్ తెలుగుదేశం, జనసేనకు షాక్ ఇచ్చింది. దాంతో ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ఆసక్తికరంగా మారాయి. అయితే రెండు గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పట్టభద్రుల స్థానాలకు జరిగిన రెండు సీట్లు కూటమి మద్దతునిచ్చిన అభ్యర్థులే గెలిచారు. అనూహ్యంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ సీటు మాత్రం పీఆర్టీయూ గెలుచుకుంది. టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో తెలుగుదేశం, జనసేన బలపర్చిన రఘువర్మ కాకుండా పీఆర్టీయూ అభ్యర్థి శ్రీనివాసులునాయుడు గెలుపొందడం కొంత కలవరపరిచినా, శ్రీనివాసులునాయుడికి అంతకుముందు బీజేపీ మద్దతు ప్రకటించడంతో అదికూడా కూటమి కోటాలోకే వచ్చినట్లయ్యింది. ఈ ఎన్నికలకు వైకాపా దూరంగా ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేసిన ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇప్పుడు ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ ఓటర్లు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వానికి ఎలాంటి సంకేతాలను ఇచ్చింది. ఈ ఫలితాల సందేశం ఏంటన్నది పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఏపీలో మూడు ఎమ్మెల్సీ ఎన్నికలు దాదాపు వంద అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగాయి. 2024లో కూటమి రెండు అసెంబ్లీల మినహా ఈ సీట్లలో విజయం సాధించింది. అప్పట్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లు ఉమ్మడిగా కూటమికి జై కొట్టారు. ఇప్పటి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను చూస్తే ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించారు. గతంలో కూడా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించినా, ఈసారి ఎన్నికలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తి దృష్టి సారించారు. ఎన్నికల్లో గెలుపు కోసం చంద్రబాబు పలుమార్లు కూటమి నేతలతో సమీక్షలు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఈ ఫలితాలపై కూటమి నేతలు విశ్లేషణలు చేస్తున్నారు. వైకాపా పోటీలో లేకున్నా, రెండు గ్రాడ్యుయేట్ స్థానాల్లో పీడీఎఫ్ అభ్యర్థులకు వేల సంఖ్యలో ఓట్లు రావడాన్ని టీడీపీ నేతలు ఇప్పుడు విశ్లేషిస్తున్నారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో ఫలితం టీడీపీని కలవరపరిచింది. మేము కూడా పీఆర్టీయూ అభ్యర్థినే బలపరిచామని తెలుగుదేశం, జనసేన నేతలు ఇప్పుడు చెప్పుకుంటున్నా, ఇది కూటమి ఓటమిగా వైకాపా విమర్శిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేయకుండా వైకాపా ఎలాంటి టెన్షన్ లేకుండా బైటపడితే, ఎన్నికల నోటిఫికేషన్ నుంచి కూటమి నేతలలో మాత్రం టెన్షన్ కనిపించింది. కూటమి ప్రభుత్వం 8 నెలల పాలనను పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎలా చూశారన్నది ఫలితాలు తేల్చాయి. అయితే టీచర్లలో అప్పుడే అసంతృప్తి చోటుచేసుకుందా అనిపిస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని కూటమి నేతలకు తెలుసు. అయినా హామీలు గుప్పించారు. సూపర్ సిక్స్ హామీలను ఒకటి రెండు మినహా మిగిలినవాటిని అమలుచేయలేక పోస్ట్‌పోన్ చేస్తూవచ్చారు. దీని ప్రభావం గ్రాడ్యుయేట్ ఎన్నికలలో కనిపించింది. సంవత్సరంలోపే ఈ టెన్షన్ పరిస్థితి ఉంటే, తర్వాత పరిస్థితి ఏంటన్నది సందేహంగా మారింది. గత ప్రభుత్వంలో చెలరేగిపోయిన వైకాపా నేతలపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరిగా వ్యవహరించడం లేదని తొలుత తెలుగుదేశం కిందిస్థాయి కేడర్‌లో అసంతృప్తి చోటుచేసుకుంది. అయినా ఓపికగా ఎదురు చూశారు. ప్రతి పని విషయంలో ముందూ వెనుకా ఆర్థిక పరిస్థితి బాగోలేదన్న పాట పాటుతుండటంతో ఈ విషయం ముందు తెలియదాన్న వ్యంగ్య ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఇవన్నీ ఎమ్మెల్సీ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం టెన్షన్‌కు గురవడానికి కారణం అయింది. అందుకే ఎన్నికల్లో ఓటుకు లెక్కకట్టి మరీ డబ్బులు పంచాల్సి వచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ నేతలకు తమ పార్టీ అధికార ప్రతినిధి, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి రాజీనామా చేయడం సంకటంగా మారింది. పార్టీ అధినేత వైఖరి వల్లే ఒకనేత పార్టీకి దూరమయ్యాడన్న అభిప్రాయం నెలకొంది. ఈ ఎపిసోడ్ కూడా ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోనే చోటుచేసుకుంది.

## ఇన్ఫోసిస్ ఐటీకి కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల 39 మంది విద్యార్థినిలు ప్రముఖ ఎమ్ఎన్‌సి కంపెనీ ఇన్ఫోసిస్ ఐటికు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లా నుండి తమ కాకినాడ ఆదిత్య మహిళా కళాశాల నుండి ఎక్కువ మంది ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సంపాదించడం కష్టతరం అయిన ప్రస్తుతరోజులలో కాకినాడ ఆదిత్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు గమ్యస్థానంగా ఉందని, దీనికి కారణం విద్యార్థి కళాశాలలో చేరిన మొదటి సంవత్సరం నుండే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇస్తూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థినీలను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డా.ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా.బి.ఈ.వి.ఎల్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ప్లేసుమెంట్ అధికారి ఎల్.ప్రసాదరావు, అధ్యాపక సిబ్బంది,విద్యార్థినిలు పాల్గొన్నారు.



## కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనను రద్దుచేయాలి

(సత్యంన్యూస్, పలాస)




ఉద్దాన ప్రాంతాన్ని ఉరితీసే కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని కోరుతూ మార్చి 18, 19తేదీలలోగ్రామాలులో ప్రజా చైతన్యపాదయాత్రలు జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నేత వంకల మాధవరావు, జిల్లా నాయకులు కొనారి మోహనరావు, సిపిఐ పలాస నియోజకవర్గం కార్యదర్శి చాపర వేణుగోపాల్‌లు పిలుపునిచ్చారు పలాసలో శుక్రవారం టి.కే.ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన మేదో మదనం సమావేశం కార్గో ఎయిర్‌పోర్ట్ పోరాట కమిటీ అధ్యక్షులు కొమర. వాసు, అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం ప్రజలను నిరాశ్రయులు చేయడం అభివృద్ధి ఎలా అవుతుందని కేంద్ర పౌర, విమానయాన శాఖ మాత్యులు కింజరాపు. రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని వారి డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులను కొల్లగొట్టి కార్పొరేట్ కంపెనీలకు ధారాధత్వం చేస్తే అభివృద్ధి ఎలా అవుతుంది అని వారు ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్ట్ కేవలం మూలపేట పోర్టు సరుకులను రవాణా చేయడం కోసం మాత్రమే ఇది ఏర్పాటు చేస్తున్నారని, అందువలన మూలపేట పోర్టుకి కేటాయించిన 2279 ఎకరాల్లో కార్గో ఎయిర్‌పోర్ట్‌కి అందులో 300 ఎకరాలు కేటాయిస్తే ఈ జిల్లాలో ఎక్కడ కూడా బలవంతపు భూసేకరణ చేయనవసరం ఉండదని వారు సూచించారు. జిల్లా అభివృద్ధి చెందాలన్నా, ప్రజల ఆదాయం పెరగాలన్నా, వంశధార బ్యారేజ్ ఆధునికీకరణకు 1500 కోట్ల రూపాయలు కేటాయించి చివరి భూమి వరకు నీరు ఇస్తే ప్రజలకు సంవత్సరానికి 1000 కోట్లు నుండి 1500 కోట్లు ఆదాయం వస్తుందని తద్వారా ప్రజలు కొనుగోలు శక్తి పెరిగి అనేక అనుబంధ పరిశ్రమలు వస్తాయని ఉపాధి దొరుకుతుందని వారన్నారు. వంశధార బ్యారేజ్ ఆధునికరణకు ఎస్ఐఎంపీ నుండి కేంద్ర మంత్రి నిధులు ఎందుకు తేవడం లేదని వారు ప్రశ్నించారు. బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టొద్దని కోరుతూ దశలవారి పోరాటాన్ని చేస్తామని వారు హెచ్చరించారు. కార్గో ఎయిర్‌పోర్ట్‌కు వ్యతిరేకంగా మార్చి 18,19 తేదీలలో గ్రామాల్లో పాదయాత్రలు, సైకిల్ యాత్రలు చేయాలని సమావేశం నిర్ణయించింది. విశాల ప్రజల మద్దతుతో పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ యంయల్ న్యూడెమోక్రసీ నాయకులు గొరకల బాలకృష్ణ, కార్యదర్శి జోగి అప్పారావు. పోట్టి ధర్మారావు, గుంటులోకనాధం, చిత్త గున్నయ్య , మర్ల సంతోష్, మైలపల్లి శేఖర్, నల్ల పరుశురాం. గుంటి జోగిరాజు, జీడీ రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, యువజన నాయకులు దున్న హరికృష్ణ, దున్న రామారావు, పొట్టి మోహనరావు, కోనేరు రమేష్ తదితరులు పాల్గొన్నారు

## తోపుడు బండ్ల వ్యాపారులు చట్ట పరిధిలో వ్యవహరించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తోపుడు బండ్లు వ్యాపారులు చట్టపరిధిలో వ్యాపారాలు నిర్వహించుకోవాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి కె.వెంకటరత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ప్రయాణిస్తూ కాలినడకన తోపుడు బండ్ల పై ప్యాక్ చేసిన లేదా తాజాగా తయారు చేసిన ఆహారాన్ని విక్రయించే వ్యాపారస్తులు ఎటవంటి రుసుములు చెల్లించకుండా ఎఫ్ఎస్ఎస్ఎఐ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను ఎఫ్ఎస్సిఎస్ పోర్టల్, యూజర్ మాన్యువల్ ద్వారా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. https://fscos.fssai.gov.in/user-manual ఉత్తర్వులు 28 సెప్టెంబర్, 2024 వర్తింపులోనికి వచ్చినట్లు ఆయన వివరించారు. వివరములకు helpline 1800112100 లేదా helpdesk - foscos.gov.in ను సంప్రదించాలన్నారు. హాకర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పదోతరగతి పరీక్షలకు ఈనెల 15న హాజరయ్యే విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రముఖ సామాజిక, వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. కోటబొమ్మాళిలోని ఆరు పాఠశాలల్లో, శ్రీకాకుళంలోని పలు పాఠశాలల్లో వెయ్యిమంది విద్యార్థులకు పరీక్ష అట్టలతోపాటు పరీక్ష సామగ్రిని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవితకు పదో తరగతి పునాది వంటిదన్నారు. ఇక్కడ ఉత్తమ మార్కులతో ప్రతిభ చాటితే ఉన్నత చదువులకు బాటలు వేసుకోవచ్చని సూచించారు. మంచి మార్కులతో ఉత్తమ లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిల్స్, షార్ప్‌నర్స్, ఎరైజర్స్, స్కేల్స్, హాల్‌టికెట్ పౌచ్‌లు పిల్లలకు అందించారు. ప్రతీఏటా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేయడం ఆనవాయితీగా వస్తోందని, అదే మాదిరిగా ఈ ఏడాది కూడా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేస్తామని వివరించారు. సూర శ్రీనివాసరావు చేస్తున్న సేవ పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలుపుతున్నారు.



**సినిమాపరిశ్రమ మద్రాస్ నుండి హైదరాబాబ్ తరలిరావటానికి ప్రయత్నాలు జరుగుతున్న తొలిదశలో "భారత్‌బంద్" సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని "బూర్గుల రామకృష్ణారావు భవనం" పరిసరాలలో జరుగుతుంది. అప్పటికి ఇప్పటిలా రద్దీ ఉండేదికాదు. సినిమాలో బంద్‌కి వ్యతిరేకంగా హీరో రెహమాన్(రఘు),సూర్య, జీడిగుంటశ్రీధర్ మరికొందరు జనాలను చైతన్యపరిచే సన్నివేశాలవి. ఓ 150మంది జూనియర్ ఆర్టిస్టులనుకూడా ప్లకార్డ్‌లతో సిద్ధం చేశాము. అంతలో లోకల్‌మేనేజర్ వచ్చి డైరెక్టర్ గారితో "ఇంకాసేపట్లో ప్రో రిజర్వేషన్స్, యాంటీ రిజర్వేషన్స్ ఉద్యమమాలు చేస్తున్న స్టూడెంట్స్ చెరొకవైపునుండి ఊరేగింపుగా ఇటువైపే వస్తున్నారట సర్" అనిచెప్పటంతో షూట్ ఆపేసి అందరూ ఓ చోట (ప్రస్తుత లుంబినీపార్క్ ఎదురుగ్గా) నిలుచున్నాం. ఓ 5 నిమిషాల్లో దూరం నుండి విద్యార్థుల నినాదాలు వినిపించటం మొదలైంది.**



# రీల్ రియల్ ఉద్యమాలు కలిసిపోయాయి!

సినిమాని ప్రేమించే దర్శకుడికెప్పుడూ చిత్రీకరణ సమయంలో సర్వేంద్రియాలూ "సినిమా"కోసమే పనిచేస్తాయి. కోడిరామకృష్ణగారికి ఓ ఆలోచన వచ్చింది. నిజమైన భావోద్వేగాలతో వస్తున్న విద్యార్థులలో వీళ్ళు కూడా కలిసివొస్తూ నినాదాలిస్తే... అది మన సన్నివేశానికి సరిగ్గా సరిపోతుంది. సహజంగానూ వస్తుంది... అనుకున్నారు.. అంతే... కెమేరామెన్ కోడిలక్ష్మన్‌గారు తన కెమేరా జూం లెన్స్ వేసి సిద్ధం చేశారు. ఉద్యమకారులు మలుపు తిరిగి వొస్తుండగానే దర్శకుడి సూచనతో హీరో బ్యాచ్ అందరూ సర్రున దూసుకుపోయి విద్యార్థుల ముందు వరుసలో కలిసిపోయారు. అప్పటికి పాపులర్ నటులుకాకపోవటంతో విద్యార్థులెవ్వరూ గుర్తుపట్టలేదు. కెమేరా హీరో బ్యాచ్‌కి జూం చేసింది.

షాట్ అద్భుతంగా సహజంగా వొస్తుందని సంబరపడుతున్నంతలో... ఓ వైపునుండి ఓ పోలీస్‌జీప్,ఓ పెద్దవ్యాన్ సర్రున దూసుకొచ్చి ఆగాయి అచ్చు సినిమాలలోలాగానే. లాఠీలతో దిగిన పోలీసులు రెహెమాన్‌నీ మిగతా నటులనీ జుట్టుపట్టుకుని కొందరినీ,చొక్కాలు పట్టుకుని కొందరినీ తిడుతూ, మేం యాక్టర్స్ అండి అనిచెబుతున్నా లాక్కెళ్ళి వ్యాన్‌లోకి ఎక్కిస్తుండగా అందరం అటువైపు పరిగెట్టాము. కోడిరామకృష్ణ గారిని గుర్తుపట్టిన పోలీసులు మీరెందుకొచ్చారిక్కడికి వెళ్ళిపోండి అంటూ తోసేశారు. వాళ్ళు మావాళ్ళు అంటున్నా వినిపించుకోకుండా వ్యాన్లోకి తోసేసి తీసుకెళ్ళిపోయారు. అయితే మమ్మల్నందరినీకూడా అరెస్ట్ చెయ్యండి అంటూ డైరెక్టర్ గారు మరో వ్యాన్ ఎక్కటంతో అందరమూ ఎక్కి పోలీసు జులుంకి వ్యతిరేకంగా నినాదాలిచ్చాము. మరో పది నిమిషాల్లో సినిమా యూనిట్ మొత్తం పోలీస్‌స్టేషన్‌లోవుంది. ఆ రోడ్లుమీద షూటింగ్‌కి మాకు పర్మిషన్ ఉంది. నటులమీద ఎలా చెయ్యిచేసుకుంటారు అంటూ డైరెక్టర్ గారు, కె.ఆదిత్య (రచయిత,దర్శకుడు) గారు ఓ పక్క, శాంతిభద్రతల సమస్య అని పోలీసులు ఓపక్క .... వాగ్వాదం తారాస్థాయికి చేరుకుంది.

మా జూనియర్ ఆర్టిస్టలందరూ పోలీస్‌స్టేషన్ బైట బైఠాయించి నినాదాలివ్వటంతో నివ్వెరపోయారు పోలీసులు. వార్త ఎన్.టి.రామారావు (అప్పుడు ప్రతిపక్ష నాయకులు) గారి వరకూ చేరిపోయి వారి సెక్రెటరీ స్పందించటం, డి.రామానాయుడుగారు, ప్రతాప్ అర్ట్స్ కె.రాఘవగారు, భానుచందర్, వినోద్‌కుమార్, అశోక్‌కుమార్ ఇంకా ఎందరో వచ్చారు. పెద్దలు అందరినీ శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఆవేశానికి స్పీడెక్కువ - ఆలోచనకి పవరెక్కువ. మాటలే మనసులను కలుపుతాయి - మాటలే మనుషుల్ని విడదీస్తాయి. నటులమీద చేయిచేసుకోవటం ముమ్మాటికీ మా తప్పే అన్నారు పోలీసులు. ఉద్యమకారులతో మావాళ్ళను కలపడం మాదికూడా తప్పేలెండి అన్నారు దర్శకులు.

అందరూ చేతులు కలిపారు... మరుసటిరోజు పేపర్లలో "భారత్‌బంద్" చిత్ర యూనిట్ అరెస్ట్ అని వచ్చిన పెద్దపెద్ద హెడ్డింగ్‌లు మాత్రం సినిమాకి ఫ్రీ పబ్లిసిటీ అయ్యాయి. తరువాత షూటింగ్ జరిగినన్నిరోజులూ పోలీసులిచ్చిన సహకారం మరువలేనిది.

(పై రెండు ఫోటోలూ పోలీస్‌స్టేషన్‌లోనివే)

- దేవీప్రసాద్.

## దిల్‌రూబా హీరోయిన్.. ఆ గొడవేంటి?

సినిమా ప్రమోషన్లలో ప్రెస్ మీట్స్, ఫోటోషూట్లు సాధారణం. కానీ కొన్నిసార్లు అవి అనూహ్య పరిస్థితులకు దారి తీస్తాయి. తాజాగా కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్ నటించిన దిల్‌రూబా మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ అలాంటి పరిస్థితే నెలకొంది. ఈ ఈవెంట్‌లో హీరోహీరోయిన్లు, ఇతర తారాగణం పాల్గొనగా, మీడియా ఫోటోగ్రాఫర్స్, హీరోయిన్ రుక్సర్ ధిల్లాన్ మధ్య చోటుచేసుకున్న సంఘటన ఇప్పుడు చర్చనీయాంశమైంది. మీడియా ఫోటోగ్రాఫర్లు ఆమెను ప్రత్యేకంగా కూర్చొని పోజ్ ఇవ్వమని కోరగా, ఆమె అసౌకర్యంగా ఫీలవుతూ కొంత అసహనంగా స్పందించిందట. సాధారణంగా సినిమా ప్రమోషన్ కోసం నటీనటులు ఫోటోషూట్లను సహజంగానే తీసుకుంటారు. కానీ ఈ ఈవెంట్‌లో రుక్సర్ ధిల్లాన్ ఫోటోగ్రాఫర్స్‌కు అనుకోని షాక్ ఇచ్చినట్టు కనిపిస్తోంది. ఆమె ఫోటోలు క్లిక్ చేయడంపై అసంతృప్తిగా స్పందించడంతో, అక్కడున్న మీడియా వ్యక్తులు కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నిజానికి ఇలాంటి సంఘటనలు తరచుగా జరగవు. కానీ ఈసారి మీడియా ఫోటోగ్రాఫర్స్‌తో హీరోయిన్ మూడ్ కుదురుకోవడం లేదని స్పష్టంగా కనిపించింది. ఆమె అభ్యంతరం వ్యక్తం చేయడం మాత్రమే కాకుండా, మహిళలు ఇలాంటి అసౌకర్యానికి లోనైతే ఎలా ఉంటుందనే ప్రశ్నను కూడా ప్రెస్ మీట్‌లో లేవనెత్తడం చర్చనీ యాంశమైంది. ఇదే సమయంలో మరో కోణం కూడా తెరపైకి వచ్చింది. ఇటీవలే దిల్‌రూబా సాంగ్ లాంచ్ ఈవెం ట్‌లో కూడా రుక్సర్ ధిల్లాన్ మీడియా ఫోటోగ్రాఫర్స్‌ను పూర్తిగా పక్కన పెట్టి, పర్సనల్ గా తన ఫోటోషూట్‌కు ప్రాధా న్యత ఇచ్చిందని టాక్. మీడియా కోసం ప్రత్యేకంగా బయట వేచిచూసే వారికి కనీసం కనబడకుండా, తాను వెనుక గేటు ద్వారా వెళ్లిపోయిందని వార్తలొస్తున్నాయి. అప్పటికే ఫోటోగ్రాఫర్స్‌లో ఓ నిరాశ ఏర్పడగా, ఇప్పుడు ట్రైలర్ లాంచ్‌లో కూడా ఆమె అలాగే చేయడంతో వాళ్లంతా అంతగా ఆసక్తి చూపించలేదని సమాచారం. ఈ అసహనమే ఫోటోగ్రాఫర్స్ తీరు మారడానికి కారణమయ్యిందని అనుకోవచ్చు. సాధారణంగా ఫోటోగ్రాఫర్లు నటీనటులకు ప్రత్యేకంగా ఫోటోలు తీసేందుకు సిద్ధంగా ఉంటారు. కానీ ఈసారి మాత్రం వారు రుక్సర్‌ను చివరికి పెట్టి గ్రూప్ ఫోటోషూట్‌లో తక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలుస్తోంది. ఒక విధంగా ఫోటోగ్రాఫర్స్ కూడా తమ నిరసన తెలియ జేయడానికి ఇది ఉపయోగించుకున్నారనే వాదన వినిపిస్తోంది. ఇక ప్రెస్‌మీట్ ముగిసిన తర్వాత ఈ ఘటన సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. హీరోహీరోయిన్లు, మీడియా మధ్య ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా జరుగుతుంటాయి. సాధారణంగా మూవీ ప్రమోషన్‌లో నటీనటులు తమ బిహేవియర్‌పై చాలా జాగ్రత్తగా ఉంటారు. కానీ ఇక్కడ రుక్సర్ ధిల్లాన్ ప్రవర్తనపై రెండు వేర్వేరు వాదనలు వినిపిస్తున్నాయి. ఆమె నిజంగానే అసౌకర్యంగా ఫీలైందా? లేక ఫోటోగ్రాఫర్స్‌కు అంతగా ప్రాధాన్యం ఇవ్వకపోవడమే కారణమా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.






## ఆవిష్కరణసభకు తరలిరండి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఈనెల 14న పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ వేడుకకు తరలి రావాలని శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయకర్త, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ పేర్కొన్నారు. ఈమేరకు నియోజకవర్గ పరిధిలో "చలో పిఠాపురం" ఆవిష్కరణ సభ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో సభ్యత్వాలలో, పార్టీ బలోపేతంలో ఆమదాలవలస నియోజకవర్గం ఎప్పుడు ముందుంటుందన్నారు. ఈనెల 14న జరగబోయే 12వ జనసేన పార్టీ ఆవిర్భావ మహోత్సవం పండగలా జరుపుకోవాలన్నారు. దానికి ప్రతీ గ్రామం నుండి పార్టీ కార్యకర్తలు, వీరమహిళలు, జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆముదాలవలసలో "చలో పిఠాపురం" పోస్టర్‌ని ఘనంగా ఆవిష్కరించామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేడాడ రామ్మోహన్, ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, సరుబుజ్జిలి మండల అధ్యక్షులు పైడి మురళీమోహన్, ఎంపీటీసీ అంపిలి విక్రమ్, పైడి నరేష్, ఉపాధ్యక్షులు పొన్నాడ బాలకలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూములను పరిరక్షించండి

(సత్యంన్యూస్, పాతపట్నం)

పాతపట్నం నియోజకవర్గంలో విలువైన ప్రభుత్వ భూములు, చెరువులు,అటవీ, దేవాదాయ భూములు ఆక్రమణలకు గురయ్యాయని వీటిపై సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించి ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సీనియర్ ఐఏఎస్,రాష్ట్ర రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి సిసోడియాని శుక్రవారం సచివాలయంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో గ్రామకంతాలు, ప్రహరాజపాలెం రెవెన్యూ విలేజ్ పరిధిలో విలువైన ప్రభుత్వ "డి" పట్టా భూములు, చెరువుల ఆక్రమణలను తక్షణమే తొలగించాలని కోరారు అలాగే దేవాలయాల భూములపై సమగ్ర విచారణ జరపాలని విన్నవించగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



# సమాజంలో స్త్రీ పురుష వివక్షత పోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


అంతరిక్ష యానం నుండి అన్ని రంగాలలో మహిళల ముందడుగుతో భారతావని ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారని, మహిళలను గౌరవించి భారతీయ సంస్కృతిని నిలబెట్టాలని అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా హర్షవల్లి లయన్స్‌క్లబ్ ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలలో వక్తల అభిలాషించారు. ఈ సందర్భంగా మహిళా ప్రతిభాశాలురను ఘనంగా సత్కరించారు. మహిళలను గౌరవించడం తరతరాలుగా వస్తున్న భారతీయ సంప్రదాయమని వారిని గౌరవించి మన జాతి ఖ్యాతిని ఇనుమడింప చేయాలని ముఖ్య అతిథి పేర్కొన్నారు. స్థానిక ది ఎం హెచ్ ఓ కార్యాలయ ఆవరణలో హర్షవల్లి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జోన్ చైర్మన్ కరణం శోభారాణి మాట్లాడుతూ మహిళలు గృహిణి గానే కాకుండా శాస్త్ర సాంకేతిక రంగాలలోనూ సేవారంగంలోనూ వైద్యరంగంలోనూ ఇంకా విభిన్న కోణాలలో తమ ప్రతిభను కనబరుస్తూ ఉన్నారని వారిని సమాజం గుర్తించిందని, అలాగే పరిపాలన రంగంలో కూడా ప్రజాప్రతినిధులుగా అధికారులుగా తమవంతు పాత్రను సమర్థవంతంగా పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హర్షవల్లి లైన్స్‌క్లబ్ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథనాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా, మహిళల పట్ల ఉన్న వివక్షతను తొలగించి మహిళా రక్షణకు ప్రత్యేక చట్టాలను రూపొందిస్తున్నటువంటి ప్రభుత్వాలను అభినందిస్తున్నట్లు చెబుతూ, ఈ రోజుకి కూడా మహిళా శిశు భ్రూణ హత్యలు జరుగుతూ ఉండడం ఆందోళన కలిగిస్తుందన్నారు. దీనిని అరికట్టడంలో ప్రభుత్వంతోపాటు ప్రజలందరూ సహకరించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమం పాల్గొన్న హర్షవల్లి లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కరణం హారిక ప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఈరోజు సమాజంలో ప్రతిభాశాలురైన మహిళల్ని తమ క్లబ్ ద్వారా సన్మానించడం తమకు సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. ప్రతిభావంతులు స్వయం ఉపాధి రంగంలో హారతి, కళా రంగంలో ప్రముఖ నృత్య కళాకారిణి సునీత, వైద్యరంగంలో ప్రముఖ నెఫ్రాలజిస్ట్ పి.శరత్‌జోత్స్న, ఉద్యోగరంగంలో ఉపాధ్యాయునిలు ఇందిరా, ఇప్పిలి వాణి, సేవారంగంలో ఆశాకిరణ్‌లు సత్కారాలను స్వీకరించారు. కార్యక్రమంలో చింతాడ కృష్ణమోహన్, మణిశర్మ, తర్లాడ అప్పలనాయుడు, సభ్యులు తరలి, ఉషారాణి, జ్యోతిర్మయి, డాక్టర్ హారిక, శ్రీమతి ఇందిర, చందక నిహార్, పార్వతీశ్వరరావు, మజ్జి సుమన్, లక్ష్మీకాంత్, లక్ష్మీపతి, శాసపు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.




# బి.ఎస్ఎన్ ఎల్.వినియోగదారుల కష్టాలు

(సత్యంన్యూస్, మందస)

మండలంలో బి.ఎస్ఎన్ఎల్. సిమ్ కార్డులు వినియోగదారుల వద్ద ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రతీనెలా రీఛార్జ్‌లు, అపర్ల రీఛార్జ్‌లు చేసిన వినియోగదారుల ఫోన్లు పలకక అనేక ఇబ్బందులు పడి ఆందోళన చెందుతున్నారు. బి.ఎస్ఎన్ఎల్. పనితీరు పై పత్రికలలో వార్తలు ప్రచురితం అవుతున్నప్పుడు ఒక వారం రోజులు సెల్ ఫోన్లు పలుకుతున్నాయి. వాట్సాప్ ఫోన్‌లకు నెట్ కూడా ఫుల్‌గా ఉంటుంది. ఆ తరువాత ఏ రోజు ఏ సమయంలో ఫోన్‌లు పలుకుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రైవేట్ సెల్ నెట్వర్క్ సంస్థ లతో బి.ఎస్ఎన్ఎల్‌లో పనిచేస్తున్న కొంత మంది ఉద్యోగులు కుమ్మక్కై .బి. ఎస్ ఎన్ ఎల్ నెట్ సర్వీస్ ఈ మండలం లో పనిచేయకుండా చేస్తున్నారని వినియోగదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మందస లో బి.ఎస్ఎన్ఎల్ కార్యాలయం ఉన్నప్పటికీ కార్యాలయం తలుపులు సంవత్సరాల తరబడి తెరవరు. ఉద్యోగులు ఎవరో తెలియని పరిస్థితి నెలకొంది. మందస, బుడార్సింగి, హరిపురం, భేతాళ పురం, గ్రామాల్లో సెల్ టవర్లు వున్నాయి. సెల్ టవర్ల ఆలనా పాలన లేకుండా గాలికి వదిలేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయినా బి.ఎస్ఎన్ఎల్ సేవలు ఇక్కడ సక్రమంగా వినియోగదారులకు అందించకుండా నిర్వీర్యం చేసేందుకు ఉద్యోగులు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. బి.ఎస్ఎన్ఎల్ వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్న సమయంలో ఇక్కడ ఉద్యోగులు వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి వినియోగదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



## ఎయిర్‌పోర్ట్‌కు భూములను ఇవ్వబోము

(సత్యంన్యూస్, మందస)

మందస మండలం రాంపురం పంచాయతీ బిడిమి గ్రామంలో ఎయిర్పోర్ట్ భూ బాధిత రైతు దున్న హరికృష్ణ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిడిమి గ్రామంలోని ఎయిర్‌పోర్ట్ భూబాధిత రైతుల తరుపున హరికృష్ణ మాట్లాడుతూ ఈ నెల 1న మా గ్రామానికి చెందిన కొందరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సహకరిస్తామని పత్రికలలో మాట్లాడిన వారి మాటల్ని భూ బాధితులమైన తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గత నాలుగు నెలల నుంచి కంటికి నిద్ర లేకుండా కడుపుకి అన్నం లేకుండా ఎయిర్‌పోర్ట్ నిర్మాణం వద్దని ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు కొమర వాసు ఆధ్వర్యంలో ప్రతీ గ్రామానికి తిరిగి బాధిత రైతులంతా ఏకమై పోరాటం చేస్తుంటే వారి కళ్ళు నెత్తికి ఎక్కాయా అని ప్రశ్నించారు. అభివృద్ధి పేరిట పచ్చని కొబ్బరి, జీడీ, పనస, మునగ పంటపొలాల్లో ఎయిర్‌పోర్ట్ నిర్మించి ఎవరికి లబ్ధి చేకూర్చాలనుకుంటున్నారని ప్రశ్నించారు. స్థానికంగా ఉన్న తమ స్థిరాస్తి భూములు కోల్పోతాయని భయాందోళనలో ఉంటే తమ తరుపున సెంటుభూమి లేని వారు, ఉద్దానం ప్రాంతానికి సంబంధం లేని వారు తమ పోరాటానికి మద్దతు తెలుపుతుంటే వాళ్లే ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అడ్డుపడుతున్నారని వాళ్ళని హేళనం చెయ్యడం సరికాదన్నారు. నాటి నుంచి నేటి వరకు సామాజిక బాధ్యత కలిగిన ఉద్యమకారులు లేకపోయి ఉంటే ఈపాటికి ఉద్దానం ప్రాంతాన్ని ఎప్పుడో కార్పొరేట్ పెద్దలకు అప్పనంగా అప్పజెప్పేవారని విమర్శించారు. ఎమ్మెల్యే శిరీష కూడా పలు సందర్భంలో రైతులు అనుమతి లేనిదే సెంటు భూమి కూడా తీసికోబోమని చెప్పారన్నారు. దీనికి గాను ఆమెకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. తమ ప్రాణాలు పోయినాసరే ఎయిర్‌పోర్ట్ కోసం సెంటుభూమి కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. 1394 ఎకరాల్లోని భూ బాధిత రైతుల్లో ఏంత మంది స్వచ్ఛందముగా ముందుకు వచ్చి అభివృద్ధి కోసం భూమిలు ఇస్తారో ఉద్దానం ప్రజలు ముందు పూర్తి వివరాలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు జుత్తు గణపతి, జుత్తు చంద్రమ్మ, జానికమ్మ, గున్నయ్య, ధర్మారావు, అప్పారావు, ఉపేంద్ర, జుత్తు మోహిని, వల్లమ్మ, మెట్టూరు పురుషోత్తమం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## "శ్రీకాకుళం"అభివృద్ధికి సహకరించండి

### - కేంద్ర ఆర్థికమంత్రికి వేణుగోపాలం వినతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధికి సహకరించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పూర్వపు ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం కోరారు. పర్యటనలో భాగంగా విశాఖపట్నం వచ్చిన సందర్భంగా ఆమెతో పాటు కేంద్ర ఆర్థిక సహాయమంత్రి పంకజ్ చౌదరిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వెనకబాటుతనాన్ని ఆమెకు వివరించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత శ్రీకాకుళం జిల్లా మరింత వెనకబాటుకు గురైందని, కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు కాక యువత ఉపాధి కోసం వలస బాట పడుతున్నారన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా వలసలు నివారించే చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. జిల్లాలో ఎక్కువ వ్యవసాయదారిత కుటుంబాలు ఉన్నాయని, ప్రధాన సాగునీటి వనరులైన వంశధార రిజర్వాయర్, మడ్డువలస ప్రాజెక్టు,నారాయణపురం ఆనకట్టు, ఆఫ్సోర్ రిజర్వాయర్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. జిల్లాలో 193 కిలోమీటర్ల మేర సుదీర్ఘమైన తీర ప్రాంత ఉందని, మత్స్య సంబంధమైన పరిశ్రమలు, పర్యాటక రంగాలను అభివృద్ధి చేయడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుందన్నారు. ప్రత్యేక నిధులు ఇచ్చి ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. వేణుగోపాలంతో పాటు, ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ మల్లా సురేంద్ర ఉన్నారు.



## గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

(సత్యంన్యూస్, మందస)

మందస పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.గవరయ్య గుండె పోటుతో అకస్మికంగా ఇంటి వద్ద మరణించారు దీంతో కుటుంబసభ్యులు, బందువులు, పోలీసు శాఖ ఉద్యోగుల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్‌కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, మందస ఎస్సై కె.కృష్ణప్రసాద్ పరిశీలించారు. ఆయన మృతికి సంతాపం తెలియజేసారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు కార్యక్రమంలో పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## హోటళ్లలో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు సీజ్

(సత్యంన్యూస్, రాజాం)

రాజాం పట్టణంలో అక్రమంగా డొమెస్టిక్ సిలిండర్లను వాడుతున్న పలు హోటళ్లపై రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు దాడులు చేసి 16 వంటగ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. పలు హోటళ్లు, బేకరీలో దాడులు చేసి కమర్షియల్ బదులుగా డొమెస్టిక్ సిలిండలను వాడుతున్న వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. గృహ వినియోగానికి సరఫరా చేసే వంటగ్యాసును ఎవరైనా వ్యాపార అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## "చలో పిఠాపురం" పోస్టర్ ఆవిష్కరణ

(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి నియోజకవర్గంలో నిర్వహించిన "చలో పిఠాపురం" కార్యక్రమం విజయవంతం చేయాలని జనసేన పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయకర్త, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ గారు పిలుపునిచ్చారు. టెక్కలి పార్టీ ఆఫీసులో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ ఈ నెల 14న జరగబోయే 12వ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి భారీ సంఖ్యలో కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు తరలివచ్చి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తదుపరిగా "చలో పిఠాపురం" పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి పీఓసీ కణితి కిరణ్ కుమార్, బుడ్డ గవరయ్య, లుంగుడు కుమారస్వామి, తాడేల చిరంజీవి, పల్లె కోటేశ్వరరావు, అనపాక జనార్ధన, పేరాడ త్రివేణి, మెట్ట నరేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

## బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ గడువు మార్చి 10 వరకు పొడిగింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులకు జిల్లా పర్యవేక్షణాధికారి బీవీ రవికుమార్ కీలక ప్రకటన చేశారు. బాలల న్యాయ (జువెనైల్ జస్టిస్) చట్టం 2015లోని సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ తప్పనిసరి అయినప్పటికీ, కొన్ని సంస్థల విజ్ఞప్తి మేరకు గడువును మార్చి 10, 2025 వరకు పొడిగించినట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన తెలిపారు. గతసారి ఇచ్చిన రిజిస్ట్రేషన్ ప్రకటనను గమనించని కొన్ని స్వచ్ఛందసంస్థలు గడువు పొడిగించాలని కోరాయన్నారు. వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని రవి కుమార్ పేర్కొన్నారు. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోని సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు ఫారమ్ మరియు ఇతర వివరాలు http://wdcw.ap.gov.inవెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. గడువు దాటిన తర్వాత కూడా రిజిస్ట్రేషన్ లేకుండా బాలల సంరక్షణ కేంద్రాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి,
రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

## ఎల్లమ్మను దర్శించుకున్న రామూ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాజీ కౌన్సిలర్ దంపతులు కెల్ల కొండలరావు, చిట్టెమ్మల ఇంటిలో ఎల్లమ్మ తల్లి సిర్ల పండగ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎల్లమ్మను దర్శించుకున్నారు. గురువారం రాత్రి ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా శ్రీకాకుళం వచ్చిన రామ్మోహన్‌నాయుడు సిర్ల పండగ కోసం అడిగి తెలుసుకున్నారు. ఈయనకు కెల్ల కిశోర్ (చిన్ని), రాజేష్‌లు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మెండ దాసునాయుడు, డోల బాల వంశీకృష్ణ, బెవర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్య సంరక్షణకే ప్రాధాన్యత



(సత్యంన్యూస్, గార)

గార ప్రాజెక్ట్ పరిధిలోని బూరవెల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రీ-స్కూల్ పిల్లలతో సరదాగా ముచ్చటించి, వారి ఆరోగ్యపరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న ఇద్దరు పిల్లల ఆరోగ్య పరిస్థితిని స్వయంగా పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. అలాగే కేంద్రంలోని పోషణ కేంద్రం స్థితిని క్షుణ్ణంగా సమీక్షించి, మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. పిల్లలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్‌ప్లాంట్ నీటిని స్వయంగా తాగి పరిశీలించి, నాణ్యతను నిర్ధారించారు. ఈ పర్యటనలో కలెక్టర్ పిల్లల ఆరోగ్య సంరక్షణ, పోషకాహారలోపం నివారణ తదితర అంశాలపై అంగన్వాడి కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. కలెక్టర్ వెంట ఐసిడిఎస్ పీడి బి.శాంతి శ్రీ కూడా ఉన్నారు.

# అందరం జనరిక్ మందులే వాడుదాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అందరం జనరిక్ మందులే వాడుదామని, భారతీయ ప్రధానమంత్రి జన్ ఔషధి పరియోజన పథకం కింద ఏర్పాటుచేసిన జన ఔషధి కేంద్రాలు జిల్లాలో మరిన్ని ప్రారంభం కావాలని, తద్వారా అతితక్కువ ధరకే నాణ్యమైన మందులు అందుబాటులోకి వస్తాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.బాలమురళీకృష్ణ ఆకాంక్షించారు. శుక్రవారం రెడ్‌క్రాస్ సంస్థ, ఫార్మాస్యూటికల్ మెడికల్ డివైసెస్ బ్యూరో ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం స్థానిక రెడ్ క్రాస్ సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించారు. డిఎంహెచ్‌ఓ ముఖ్య అతిథిగా పాల్గొని రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్‌తో కలిసి మాట్లాడుతూ జన్ ఔషధి కార్యక్రమం ద్వారా ప్రముఖ కంపెనీలు తయారుచేసే మందులు, సర్జికల్ ఐటమ్స్ అతి తక్కువ ధరలకే నాణ్యమైనవి లభిస్తాయని, దీన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సామాన్యులకు కూడా ఔషధాలు అందుబాటులో ఉండేలా భారత ప్రధాని ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పరియోజన పథకం ప్రారంభించారని గుర్తుచేసారు. 2008లో ప్రారంభమైన ఈ పథకం జిల్లాలో 7 కేంద్రాల ద్వారా ఔషదాలు అందిస్తున్నారని, తద్వారా పేదలకు ఎంతో ఉపశమనం లభిస్తుందని అన్నారు. జిల్లాలో జన్ ఔషధి



కేంద్రాలు ఉండటం సంతోషకరమని, మరిన్ని కేంద్రాలు జిల్లాలో ఏర్పాటుకావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. జన్ ఔషధి పథకంపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురపు తేజేశ్వరరావు మాట్లాడుతూ జన్ ఔషధి దివాస్ నేటికీ 6 వసంతాలు పూర్తి చేసుకుంటున్న శుభతరుణమని, జన్ ఔషధి సేవల ద్వారా ప్రజలకు మరింత స్వస్తత కలిగించాలని, నాణ్యమైన మందులు అందరూ వినియోగించుకోవాలని జిల్లా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడి మరిన్ని మందులు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తానన్నారు. జన్ ఔషధి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నరసింహా కిషోర్, డ్రగ్స్ ఏడి ఎం.చంద్రరావు, రాష్ట్రీయ స్వాస్థ్య కార్యక్రమం నోడల్ అధికారి రాజేష్, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవ రావు, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, నిక్కు అప్పన్న, బి.చిన్మయిరావు, కళ్యాణ్, పి.వైకుంఠరావు, రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయకర్తలు కె.సత్యనారాయణ, జి.రమణ, పెంకి చైతన్య, బీజేపీ సభ్యులు బిర్లంగి ఉమా మహేశ్వరరావు, అట్టాడ రవిబాబ్జి, చల్లా వెంకటేశ్వరరావు, మేనేజర్లు గుణాకరరావు, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కె.శ్యాంసుందర్‌రావు, కె.నర్సింగరావు, ఫార్మాటిక్స్ భాగ్యభారతి, శ్రావణి, రెడ్‌క్రాస్ సంస్థ వాలంటీర్లు, జూనియర్ రెడ్‌క్రాస్ సంస్థ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ విద్యాలయంలో ఘనంగా ప్రారంభమైన టెక్‌ఫెస్ట్

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాజీవ్‌గాంధీ విజ్ఞానిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళంలో జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ (టెక్నివర్స్ 2కె25) శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆచార్య విజయ్‌కుమార్ స్టాల్స్‌ని ప్రారంభించారు. టెక్నివర్స్ ఈ నెల 7,8,9 తేదీల్లో జరుగనుంది. ఈ టెక్నివర్స్‌లో ఐఐటి గువహతి, ఐఐటి తిరుపతి, ఐఐటి హైదరాబాద్, ఐఐటి మద్రాస్, ఐఐటి జోధ్పూర్, ఐఐటి భువనేశ్వర్, ఇస్రో నుంచి ఎన్ఐటి నాగపూర్ ప్రొఫెసర్లు ఏఐ, సెన్సార్, హైడ్రాలజీ, మెకానికల్ బిహేవియర్ ఆఫ్ హై టెంపరేచర్ అల్లాయ్స్, విఎల్ఎస్ఐ, పవర్ ఎలక్ట్రానిక్స్‌పై ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ టెక్నివెర్స్‌లో డిపార్ట్‌మెంటల్ వర్క్‌షాప్స్, టెక్నికల్ క్విజ్, రోబోటిక్స్, టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్ ఇలా 30 పైబడి ఈవెంట్స్ ఉన్నాయి. ఈ టెక్నివెర్స్‌కి కన్వీనర్‌గా గేదెల రవి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ సీహెచ్ తేజ కిరణ్ సివిల్ హెచ్‌వోడీ కోకన్వీనర్‌గా ఉన్నారు. కార్యక్రమంలో డైరక్టర్ ప్రొఫెసర్ బాలాజీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ముని రామకృష్ణ, డీన్ అకడమిక్స్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ సిహెచ్ వాసు, అకౌంట్స్ ఆఫీసర్ కె.మోహనరావు, డిపార్టుమెంట్ హెచ్‌ఓడిలు, ఉపాధ్యాయులు, సహోద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు జగ్గుశాస్త్రులపేట, బైరిశాస్త్రులపేట గ్రామాల్లో ఉచితంగా గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ రోణంకి ఆనందరావు తెలిపారు. డివిజనల్ పర్యవేక్షణాధికారిగా డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.రామమోహన్ ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బందికి, రైతులకు ఈ టీకాల ప్రాముఖ్యత వివరించారు. గాలికుంటు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి సంక్రమిస్తే తీసుకోవాల్సిన నివారణ చర్యలను గూర్చి రైతులకు తెలిపారు. ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు నాలుగు మాసాల వయసు దూడల నుంచి అన్ని వయసుల పశువులకు వేసుకోవచ్చని, నాలుగు మాసాల లోపు దూడలకు, అనారోగ్య పశువులకు వేయకూడదని, నిండుచూడుతో ఉన్నవాటికి కూడా వేయకూడదని, చల్లని వాతావరణంలో అనగా ఉదయం 6:30 గంటల నుంచి ఈ టీకాలు వేయడం ప్రారంభించాలని సిబ్బందికి సూచించారు. టీకాలు వేశాక పాడి పశువులను ఆరుబయట మేపునకు తీసుకువెళ్లకూడదని, దున్నలైతే ఒక రోజు విశ్రాంతినివ్వాలని తెలిపారు. చికిత్స కంటే నివారణ మేలు కనుక పశువైద్య సిబ్బంది గ్రామాలకొచ్చి టీకాలు వేసినపుడు నిరాకరించవద్దని, పాడిరైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరంలో దుర్గాప్రసాద్, జల్లేపల్లి ఉమామహేశ్వరరావు, పశు ప్రేమికులు రాజ్యలక్ష్మి, సాయికుమార్ పాల్గొన్నారని తెలిపారు.

## చెరువుగట్టుపై మొక్కలు తొలగిస్తే చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఆక్రమణదారులకు ఎటువంటి సంబంధం లేదని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు. ఏడు చెరువులు గ్రామ పంచాయతీ ఆస్తిగా పరిగణించడానికి తీర్మానం చేసినట్టు తెలిపారు. సదరు చెరువులపై గల మొక్కలు గ్రామపంచాయతీ ఆస్తిగా పరిగణించినట్టు తెలిపారు. ఆ మొక్కలు విక్రయించినా, గట్టు చదును చేసినా, మొక్కలు తొలగించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

**గ్రామ ఆస్తిగా పరిగణించిన చెరువుల వివరాలు**

40 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న సర్వే నెంబర్ 14లో సవిటి చెరువు, 32 సెంట్ల విస్తీర్ణంలోని సర్వే నెంబర్ -35లోని కొండవాని చెరువు, 35 సెంట్ల విస్తీర్ణంలోని సర్వే నెంబర్ 54లో జాలవాణి చెరువు, 22 సెంట్ల విస్తీర్ణంలోని సర్వే నెంబర్ 55లో ధర్మాన చెరువు, 50 సెంట్ల విస్తీర్ణంలోని సర్వే నెంబర్-102లో రాళ్ల చెరువు, 1.10 ఎకరాల విస్తీర్ణంలోని సర్వే నెంబర్ 159లో ఎరకాలమ్మ చెరువు, 70 సెంట్ల విస్తీర్ణంలోని సర్వే నెంబర్ 168లో వానోడు చెరువు.

## జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కలసికట్టుగా విజయవంతం చేద్దాం

- జనసేన రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్ -




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 14న పిఠాపురం చిత్రాడలో జరగబోయే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని జనసేనపార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి, పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాచరణ సమన్వయకర్త పిసిని చంద్రమోహన్, జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాయకులు మెట్ట వైకుంఠరావు, గుమ్మడి శాంతారావు, జనసేన పార్టీ ఆవిర్భా దినోత్సవ వేదిక గ్రౌండ్ మేనేజ్మెంట్ సభ్యులు కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు ప్రాంతాల నుంచి జనసైనికులు, వీరమహిళలు లక్షలమంది హాజరవుతున్న సభావేదిక కోసం సిమ్మింట్ కాంక్రీట్ పనులు శరవేగంగా జరుగుతున్న సభా ప్రాంగణాన్ని శుక్రవారం జనసేనపార్టీ ప్రోగ్రామ్స్ కమిటీ అధ్యక్షులు కళ్యాణం శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# విరోధం వద్దు.. కలిసి పనిచేద్దాం

## - భారత్‌కు చైనా మంత్రి సూచన -



**న్యూఢిల్లీ:** న్యూఢిల్లీ-బీజింగ్ పరస్పరం విరోధం పెంచుకొనే కంటే భాగస్వాముల్లా కలిసి పని చేయడం ఉత్తమమని చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ అభిప్రాయపడ్డారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆసియాలోనే కీలకమైన తమ రెండు దేశాల మధ్య సహకారం అత్యంత ముఖ్యమన్నారు. దీనిని ఆయన సమన్వయంతో చేసే నృత్యంతో పోల్చారు. 'చైనా-భారత్ భాగస్వాములుగా పరస్పర విజయానికి సహకరించుకోవాలి. దీనిని సాధించడానికి డ్రాగన్-ఎలిఫెంట్ డ్యాన్స్ ఒక్కటే ఇరుపక్షాలకు ఉన్న సరైన మార్గం" అని వాంగ్ యీ వ్యాఖ్యానించారు. ఇరుదేశాలు పరస్పరం చిన్నబుచ్చుకోవడం కంటే.. ఒకరికొకరు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. పరస్పర సహకారమే రెండు దేశాల ప్రజల ప్రాథమిక ప్రయోజనాలను బలోపేతం చేస్తుందన్నారు. ఇక న్యూఢిల్లీ-బీజింగ్ మధ్య మెరుగైన సంబంధాలు ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ సౌత్ దేశాలకు కూడా ప్రయోజనమన్నారు. అంతర్జాతీయ సంబంధాల్లో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసి.. అంతర్జాతీయ వేదికలపై గ్లోబల్ సౌత్ (పేద దేశాల) స్థానాన్ని శక్తిమంతం చేస్తుందన్నారు. ఇరుదేశాల మధ్య వివాదాలను దౌత్యమార్గంలో పరిష్కరించుకొంటామని, సమష్టి ప్రయోజనాలను కాపాడుకోవడానికి సహకారం అవసరమని వాంగ్ అభిప్రాయపడ్డారు. "చర్చల ద్వారా పరిష్కారం కానీ సమస్యే లేదు. అదే సమయంలో సహకారంతో చేరుకోలేని లక్ష్యాలు లేవు" అని వెల్లడించారు. దక్షిణాఫ్రికాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల భేటీలో భారత మంత్రి జైశంకర్‌తో చైనా మంత్రి వాంగ్ యీ భేటీ అయ్యారు. ఆ తర్వాత కొన్ని వారాల్లోనే ఈ ప్రకటనలు వెలువడ్డాయి. వాస్తవానికి 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు అట్టడుగుస్థాయికి పడిపోయాయి. ఆ తర్వాత పలు విడతలుగా ఇరుదేశాలకు చెందిన దౌత్యవేత్తలు, సైనికాధికారులు చర్చలు జరిపారు. 2024లో ప్రధాని మోదీ-చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సు సందర్భంగా కజాన్‌లో భేటీ అయ్యారు. ఆ తర్వాతనే సరిహద్దుల్లో ఉద్రిక్తతలు ఉన్నచోట్ల నుంచి ఇరుదేశాల బలగాలు వెనక్కి తగ్గి పాత స్థితికి చేరుకొన్నాయి. మరోవైపు ఈ ఏడాది చైనా షాంఘై సహకార సంస్థ సమావేశాలకు ఆతిథ్యం ఇస్తోంది. భారత ప్రధాని మోదీ అందులో పాల్గొనడం అత్యంత కీలకంగా మారనుంది.

# మీరు సభాహక్కులకెళ్తే.. నేను అట్రాసిటీ పెడతా!

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టాలనేది మాత్రమే చర్చించాలని, రాజకీయ భజనలు మానుకోవాలని డుమా పీడీ ఆ సభలోనే సూచించడంతో ఈ పంచాయితీ ఎమ్మెల్యే గొండు శంకర్ వద్దకు అప్పట్లోనే వచ్చింది. ఈ విషయంపై పీడీ సుధాకర్‌ను కార్యాలయానికి పిలిపించి ఎమ్మెల్యే మందలించినట్టు భోగట్టా. అక్కడికి కొద్ది రోజుల తేడాలోనే శ్రీకాకుళం రూరల్ మండలంలో కూడా ఓ గ్రామసభలో ఇదే తంతు జరిగింది. అప్పట్నుంచి ఎమ్మెల్యేకు, డుమా పీడీకి మధ్య గ్యాప్ పెరిగిపోయింది. ఈ మంటలో నెయ్యి పోసినట్టు రథసప్తమిలో హెలికాప్టర్ గొడవ ఒకటొచ్చి చేరింది. ఇంతవరకు సిబ్బంది మాత్రమే పీడీతో ఇబ్బంది పడుతున్నారని డుమాలో అందరూ భావించారు. కానీ ప్రజాప్రతినిధులు కూడా ఆయనతో ఇబ్బందే ఎదుర్కొంటున్నారు. ఆమధ్య కొందరు వైకాపా ఫీల్డ్ అసిస్టెంట్లను తన నియోజకవర్గంలో తొలగించాలని మంత్రి అచ్చెన్నాయుడు సుధాకర్‌కు చెప్పారు. కానీ అది ఎప్పటికీ చేయకపోవడంతో నిమ్మాడ పిలిచి సుధాకర్‌ను మందలించడంతో ఆ పని జరిగినట్లు తెలుస్తుంది. నీటి యాజమాన్య సంస్థ రాష్ట్ర సంఘంలో నాయకుడిగా ఉన్న సుధాకర్ వాస్తవానికి నిజాయితీపరుడే. గడిచిన ఏడేళ్లు డుమాను పూర్తిగా గాలికొదిలేసి ప్రతీ పనిలోనూ వాటాలు సర్దుకున్న అధికారులు పనిచేసిన చోట సుధాకర్ లాంటి డబ్బులకు కక్కుర్తిపడని వ్యక్తి పనిచేయడం గొప్ప విషయమే. కానీ ఉద్యోగులను, ప్రజాప్రతినిధులను కాదని ఆయన సంస్థను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపడం కష్టం. చాలా కాలం నుంచి వందరోజుల పనికల్పనలోనూ, అత్యధికంగా వేతనాలు అందించడంలోనూ శ్రీకాకుళం ఒకటి నుంచి మూడు స్థానాల లోపే రాష్ట్రంలో ఉంటుంది. ఎందుకంటే.. ఇక్కడ వలస పోయే కూలీలకు ఎన్ఆర్ఈజీఎస్ ఒక వరం. పీడీలుగా ఉన్నవారు ఏ పనీ చేయకపోయినా శ్రీకాకుళం, విజయనగరం లాంటి జిల్లాల్లో కూలీలకు, పనులకు కొదవలేదు. గత ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులను వేరే పథకాలకు మళ్లించడంతో రూ.265 కోట్ల నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. దీంతో మెటీరియల్ కాంపొనెంట్ పనులు జరగలేదు. అయితే ఈసారి కేంద్ర ప్రభుత్వం చెరువుల తవ్వకం వంటి పనులను ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టడానికి సిద్ధంగా లేదు. దాని స్థానంలో గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలకు మండువేసవిలో కూడా నీరు అందించే విధంగా చిన్నచిన్న 8/8 ఫారం పాండ్స్ తవ్వడం, అలాగే ప్రతీ ఇంటి ముందు వాడకం నీరు భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు తవ్వడం వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తుంది. అలాగే మెటీరియల్ కాంపొనెంట్ కింద పశువుల శాలలు ఏర్పాటు చేయాలని, సముద్రతీర ప్రాంతాల్లో చేపలు ఎండబెట్టడానికి ప్లాట్‌ఫారాలు కట్టమని చెబుతుంది. అయితే ఇవి గ్రామాల్లో పైపైగా చేసే చెరువు పనులు లాంటివి కావు. మస్తరేసి వేతనం తీసుకుపోవడానికి కుదరదు. ఎకరం పొలం ఉన్న రైతు క్షేత్రంలో 8/8 గుంత తవ్వకపోతే స్వయంగా రైతే ఒప్పుకోడు. అలాగే ఇంటిముందు ఇంకుడు గుంత లెక్కప్రకారం తవ్వకపోతే ఇంటి యజమాని ఊరుకోడు. కాబట్టి ఈ పనులు చేయడానికి గ్రామాల్లో కూలీలు ముందుకు రావడంలేదు. కానీ రూ.360 కోట్లకు పైబడి నిధులు ఉండిపోయాయని, అప్పటికీ పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ వంటి శాఖలకు పనులు అప్పగించినా డుమాలో మాత్రం ఇంకా ఉండిపోతున్నాయని భావిస్తున్న పీడీ సుధాకర్ దాన్ని ఎలా చేయించుకోవాలో తెలీక సిబ్బంది మీద విరుచుకుపడుతున్నారు. విజయవాడలో డుమా హెడ్‌ఆఫీస్ ఫలానా పనిని వారం రోజుల్లో పూర్తిచేయాలని డెడ్‌లైన్ ఇస్తే, ఈయన ఇక్కడ మూడు రోజులకే పూర్తికావాలని సిబ్బందిని రఫ్ఫాడేస్తున్నారు. అసలే కూలీలు దొరక్క క్షేత్రస్థాయిలో డుమా సిబ్బంది ఇబ్బంది పడుతుంటే, విజయవాడ కేంద్ర కార్యాలయం నుంచి వర్చువల్ మీటింగ్ అయిన వెంటనే శ్రీకాకుళంలో డుమా ఉద్యోగులందరితోనూ అర్థరాత్రి, అపరాత్రి లేకుండా పీడీ గూగుల్ మీటింగ్ పెడుతున్నారు. వీటన్నిటిపైనా అటు కలెక్టర్, ఇటు మంత్రి దృష్టిలో ఉన్నా పీడీ మీద ఎటువంటి చర్యలూ లేవు. ఇప్పుడు స్వయంగా ఎమ్మెల్యేపైనే కేసు పెడతానన్న అంశంలో రాజకీయ నాయకులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.